సాక్షి
వికారాబాద్

సోమవారం ၊ 24 ၊ ఏప్రిల్ ၊ 2023



బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్
బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ప్రజాకవి, గాయకుడు జయరాజ్ అన్నారు. 8లో▸



వచ్చేది బీజేపీ ప్రభుత్వమే
రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు ధీమా వ్యక్తం చేశారు. 8లో▸



మృత్యుఘంటికలు
అకాల వర్షాలు కురుస్తున్న వేళ.. ఉరుములు, మెరుపులు, పిడుగులు భయాందోళనకు గురిచేస్తున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

జిల్లా గ్రంథాలయం సేవలు పొడిగింపు

వికారాబాద్ అర్బన్: జిల్లా గ్రంథాలయం ఆదివారం నుంచి 14 గంటల పాటు సేవలు అందించనుంది. కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశం మేరకు జిల్లా గ్రంథాలయం ఉదయం 8గంటల నుంచి రాత్రి 10గంటల వరకు తెరిచే ఉంటుందని జిల్లా లైబ్రేరియన్ సురేశ్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ సందర్భంగా ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు సైతం అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మౌలిక వసతులైన ఇంటర్నెట్ వైఫై సౌకర్యంతో పాటు ఫర్నిచర్ కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఆయా ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సురేశ్‌బాబు పేర్కొన్నారు.

రేడియోగ్రాఫర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్ అర్బన్: కలెక్టర్ ఆదేశం మేరకు వికారాబాద్ ఆస్పత్రిలోని టీ–హబ్ డయాగ్నస్టిక్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న రేడియోగ్రాఫర్ పోస్టును కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేసుకునేందుకు నిర్ణయించినట్లు డీసీహెచ్‌ఓ డాక్టర్ సీహెచ్. ప్రదీప్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 24 నుంచి 26వ తేదీ సాయంత్రం లోపు వికారాబాద్ ఏరియా ఆస్పత్రిలోని పర్యవేక్షణ అధికారి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతం

అనంతగిరి: గురుకుల ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసిందని ఆర్‌సీఓ డాక్టర్ శారద తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్షకు 7,513మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 6,933 మంది హాజరయ్యారన్నారు. మొత్తం 21 సెంటర్లలో పరీక్ష నిర్వహించినట్లు ఆమె తెలిపారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాల్సిందే



దీక్షలో మాట్లాడుతున్న జయరాంచారి

బషీరాబాద్: నావంద్గీ రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని చేపట్టిన నిరసన దీక్షలు 15 రోజులుగా కొనసాగుతున్నాయి. రైల్వే సాధన సమితి చేపట్టిన దీక్షలకు మండల ఉపాధ్యాయ సంఘాలు పీఆర్‌టీయూ, తెలంగాణ యూటీఎఫ్ నాయకులు మద్దతు తెలుపుతూ దక్షిణ మధ్య రైల్వే మేనేజర్‌కు లేఖలు రాశారు. అలాగే విద్యుత్ శాఖ అధికారులు సైతం మద్దతు తెలిపారు. ఆదివారం నాటి నిరసన దీక్షలో జయ్‌రాంచారి, నాగరాజు, రవిసుఘంది, పరుషరాం, దిలీప్ సార్ద, బసంత్‌రెడ్డి, సంతోశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేవంత్‌పై ఆరోపణలు సహించం



ఈటల దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొడంగల్: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసూఫ్‌లు హెచ్చరించారు. ఆదివారం కొడంగల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఈటల రాజేందర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. జాతీయ రహదారిపై ధర్నా చేశారు. ఇన్నాళ్లు కేసీఆర్ పంచన ఉన్న ఈటల తన స్వార్థ ప్రయోజనాల కోసం బీజేపీలో చేరారని ఆరోపించారు. ప్రస్తుతం మళ్లీ కేసీఆర్‌కు మేలు చేయాలనే ఉద్దేశంతోనే రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. ఈటల వెంటనే రేవంత్‌రెడ్డికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నందారం ప్రశాంత్, నర్సింహ, సంజీవరెడ్డి, శంకర్‌నాయక్, భీంరాజు, అశ్వాక్, రాము, ఆసీఫ్‌ఖాన్, రాములు, నర్సింగ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి అభివాదం చేస్తున్న అమిత్‌షా



సభకు హాజరైన కార్యకర్తలు, జనం



‘సంకల్పం’ సక్సెస్

బీజేపీ ఎన్నికల శంఖారావం
- చేవెళ్ల పట్టణం కాషాయమయం
- ఉత్తేజపర్చిన అమిత్‌షా, ఇతర నేతల ప్రసంగాలు
- విజయ సంకల్ప సభ విజయవంతం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో పాగా వేయడమే లక్ష్యంగా బీజేపీ ఎన్నికల శంఖారావం పూరించింది. చేవెళ్ల లోక్‌సభ కేంద్రంగా ఆదివారం విజయ సంకల్ప సభ నిర్వహించింది. గ్రామీణ ప్రాంతాల నుంచి భారీగా జనసమీకరణ చేపట్టారు. ఆశించినదానికంటే ఎక్కువగా సభకు తరలిరావడం పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసం వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, పార్టీ ఇన్‌చార్జి తరుణ్‌చుగ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, చేరికల కమిటీ కన్వీనర్ ఈటల రాజేందర్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు, బీసీ మోర్చ జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ తదితరులు హాజరయ్యారు. తమ ప్రసంగాలతో పార్టీ శ్రేణులను ఉత్తేజపరిచారు. భారత్ మాతాకీ జై, వందే మాతరం నినాదాలతో హోరెత్తించారు. వచ్చే ఎన్నికల్లో చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలోని అన్ని స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే అని అభిప్రాయపడ్డారు.

“ ఆయన ఫాంహౌస్‌లో నిద్రపోతుండు

ప్రధాని మోదీ దేశంకోసం అహర్నిశలు కష్టపడుతుంటే సీఎం కేసీఆర్ ఫాంహౌస్‌లో నిద్రపోతుండు. రాష్ట్రం, జిల్లాలు, గ్రామాల అభివృద్ధి కోసం కేంద్రం పనిచేస్తుంటే కేసీఆర్ మాత్రం కుటుంబ సంక్షేమం కోసం పాకులాడుతుండు. పేదలకు కేంద్రం ఇచ్చే నిధులు చేరకుండా అడ్డుపడుతుండు. కేంద్ర పథకాలను అడ్డుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పందులు తిరుగుతున్నాయ్. బాలికలకు కనీసం బాత్‌రూంలు లేవు. కరెంటు షాక్ తగిలి ఇటీవల ఓ అమ్మాయి చనిపోయింది. బీజాపూర్ రోడ్డు విస్తరణ పనులకు కేంద్రం ముందుకొస్తే కేసీఆర్ అడ్డుకుంటుండు. భూసేకరణలో నిర్లక్ష్యం చేస్తుండు.

– కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీ

ఆటలకు వేళాయె.. మైదానాలు లేవాయె

వేసవి సెలవుల వేళ విద్యార్థులు ఆటలకూ నోచుకోవడంలేదు. ఇందుకు కారణం సరైన మైదానాలు లేకపోవడమే.. జిల్లా కేంద్రంలోనే క్రీడామైదానం లేదంటే ఆటలపై పాలకులకు ఉన్న శ్రద్ధ అర్థమవుతోంది. కొన్ని చోట్ల ఊరికి దూరంగా ఉండటం.. సౌకర్యాలు లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. ప్రజాప్రతినిధులు క్రీడోత్సవాల వేళ హామీలు గుప్పించడం తప్ప కార్యరూపం దాల్చడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

వేసవి సెలవుల వేళ విద్యార్థుల అవస్థలు
- ఆట స్థలాలు లేక ఇబ్బందులు
- జిల్లా కేంద్రంలోనే క్రీడామైదానం కరువు
- కొన్ని ఊరికి దూరం.. సౌకర్యాలు శూన్యం
- పత్రాలకే పరిమితమవుతున్న నిధుల మంజూరు
- పాలకుల హామీలే తప్ప కనిపించని ఆచరణ



జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు (ఫైల్)

వికారాబాద్ అర్బన్: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు మంగళవారం నుంచి వేసవి సెలవులు. ఈ క్రమంలో యువకులు, చిన్నారులు ఆటలకు మొగ్గు చూపుతారు. కానీ ఎక్కడా సరైన క్రీడా మైదానం లేకపోవడంతో చెట్లకింద, చదును చేయని వ్యవసాయ పొలాలే దిక్కవుతున్నాయి. ఇటీవల ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలు గ్రామాలకు దూరంగా ఉండటమే కాక.. కేవలం బోర్డులకే పరిమితమై ఎలాంటి ఏర్పాట్లు చేపట్టలేదు. జిల్లా కేంద్రమైన వికారాబాద్ పట్టణంలో క్రీడా మైదానం లేకపోవడం ఈ ప్రాంత విద్యార్థులకు, క్రీడాకారులకు శాపంగా మారింది.

క్రీడారంగంలో వెనుకబాటు..

పూర్తిగా గ్రామీణ ప్రాంత జిల్లాగా ఏర్పడిన వికారాబాద్.. క్రీడారంగంలో పూర్తిగా వెనకబడి ఉందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రజా ప్రతినిధులు, అధికారులు గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడం విస్మరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రతీ ఏటా జనవరి మాసంలో నిర్వహించే యువజన క్రీడోత్సవాలను అధికారులు నామమాత్రంగా నిర్వహించడం, క్రీడాకారులందరికీ అందుబాటులో ఉండే విధంగా స్టేడియం నిర్మిస్తామని హామీ ఇవ్వడం తప్పితే అమలు చేయడం లేదు. దీంతో గ్రామీణ క్రీడాకారులు వారి నైపుణ్యాలను బయట పెట్టుకునేందుకు ఓ వేదిక లేకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని రాజీవ్‌నగర్‌లో మినీస్టేడియం కోసం 1987లో అప్పటి ప్రభుత్వం నాలుగు ఎకరాల 28 గుంటల భూమి కొనుగోలు చేసింది. ఇక్కడే మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అంతలోనే వికారాబాద్‌కు 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి భవనం మంజూరు కావడంతో ఈ స్థలాన్ని రెవెన్యూ అధికారులు వైద్య శాఖకు కేటాయించారు. దీంతో అక్కడ ప్రభుత్వ ఆస్పత్రి భవన నిర్మాణం చేశారు. పట్టణవాసులకు బ్లాక్ గ్రౌండ్ అందుబాటులో ఉన్నా అందులో ఎలాంటి సౌకర్యాలు లేవు.

ద్వితీయ శ్రేణి మైదానమేదీ?

జిల్లా కేంద్రంలో మినీ స్టేడియానికి బదులుగా అన్ని హంగులతో కూడిన ద్వితీయ శ్రేణి మైదానం నిర్మించాలని క్రీడా శాఖ అధికారులు ఉన్నతాధికారులకు ఐదేళ్ల క్రితమే ప్రతిపాదనలు పంపించారు. పెద్ద స్టేడియం నిర్మిస్తే రాష్ట్ర అవతరణ, జిల్లా ఆవిర్భావ ఉత్సవాలు, ఇతర జిల్లా స్థాయి క్రీడలు జరిపేందుకు వీలుగా ఉంటుందని అధికారుల అభిప్రాయం. కానీ ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు.

జాడలేని నిధులు

జిల్లాకు ఒక మైదానం కాకుండా ఏకంగా మూడు ద్వితీయ శ్రేణి క్రీడా మైదానాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు నిర్ణయించారు. ఒకటి జిల్లా కేంద్రంలోని ఎన్నెపల్లి రెవెన్యూలోకి వచ్చే సర్వే నంబర్ 19/1 లో 5ఎకరాల ప్రభుత్వ భూమిని జిల్లా క్రీడా శాఖకు కేటాయించారు. 2019లో ప్రభుత్వం రూ. 2.65 కోట్లను మంజూరు చేసింది. కానీ ఈ నిధుల మంజూరు కేవలం పత్రాలకే పరిమితమైంది. నిధులు విడుదల కాకపోవడంతో క్రీడా మైదానం పనులు జరగలేదు. అదేవిధంగా పరిగి, కొడంగల్ నియోజకవర్గాల క్రీడాకారులకు అందుబాటులో ఉండేలా కుల్కచర్ల మండల కేంద్రంలో క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేసేందుకు సర్వే నంబర్ 637లో నేడు ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఈ మైదానం నిర్మాణానికి కూడా రూ. 2.65 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. అదే విధంగా తాండూరు నియోజకవర్గం క్రీడాకారులకు అందుబాటులో ఉండేలా యాలాల మండలం బెన్నూరు సమీపంలో క్రీడా మైదానం ఏర్పాటు చేసేందుకు, 4ఎకరాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు జిల్లా క్రీడల శాఖకు అప్పగించారు. ఇక్కడ కూడా రూ. 2.65కోట్లు మంజూరు చేసింది. ఈ మూడు మైదానాల పనులను ఈడబ్ల్యూడీసీ దక్కించుకుంది. కానీ ఇప్పటి వరకు ఎలాంటి నిధులు విడుదల కాకపోవడంతో పనులు జరగడంలేదు.

బసవేశ్వరుడు.. ఆదర్శనీయుడు



తాండూరు టౌన్: బసవేశ్వరుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

బసవేశ్వరుడి జయంతి ఉత్సవాలు జిల్లాలో వైభవంగా జరిగాయి. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, పలు సంఘాల నేతలు బసవేశ్వరుని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బసవేశ్వరుడి బోధనలు అనుసరణీయమని, గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు.

‘ఆర్టిజన్స్’ సమ్మెతో ఇబ్బందులు రానివ్వం

- ఎవరైనా సమస్యలు సృష్టిస్తే మా దృష్టికి తేవాలి
- ఎస్‌ఈ జయరాజు వెల్లడి

అనంతగిరి: విద్యుత్ సంస్థలో వివిధ సబ్ స్టేషన్ ఆపరేటర్లు, ఓఎం విభాగంలో పనిచేస్తున్న హెచ్–82 ఆర్టిజన్స్ యూనియన్ కార్మికులు సమ్మె చేపట్టినా వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేశామని జిల్లా ఎస్‌ఈ వి.జయరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమ్మెకు వెళ్లే వారిపై ఎస్మా చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడమే కాకుండా అధిక సంఖ్యలో సిబ్బందిని నియమించి వినియోగదారులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎవరైనా కృత్రిమంగా సమస్యలు సృష్టిస్తే మా దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. వినియోగదారులు ఏమైనా ఇబ్బందులు ఉంటే ఈ నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. జిల్లా కంట్రోల్ రూం 9493193177, 9491441225, వికారాబాద్ 9440813064, పరిగి 9440813065, తాండూరు 9440813067, కొడంగల్ 9440813433లో నంబర్లను సంప్రదించాలన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

- అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన తీగపై పడి దుర్మరణం
- కొటాలగూడలో ఘటన



యాదయ్య (ఫైల్)

అనంతగిరి: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన ఆదివారం వికారాబాద్ మండలం కొటాలగూడలో చోటు చేసుకుంది. సీఐ శ్రీను తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన రైతు వడ్డె యాదయ్య(50) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సాగు చేసిన మొక్కజొన్నను అడవి పందుల బారి నుంచి కాపాడుకునేందుకు పొలం చుట్టూ తీగలు అమర్చి విద్యుత్ కనెక్షన్ ఇచ్చాడు. రాత్రి కరెంట్ సరఫరా చేసి ఉదయాన్నే తీసేస్తున్నాడు. దీంతో పందుల బెడద తగ్గింది. ఉదయాన్నే కనెక్షన్ తొలగిస్తున్న క్రమంలో కాలు జారి కంచెపై పడ్డాడు. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు బోరున విలపిస్తూ పొలం వద్దకు పరుగులు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. యాదయ్య భార్య అమృతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డివైడర్ సరే.. మొక్కలేవీ?

మోమిన్‌పేట: మండల కేంద్రంలో డివైడర్ నిర్మించారు కానీ నేటికీ మొక్కలు ఏర్పాటు చేయడంలేదు. రూ.10కోట్లతో రెండు కిలోమీటర్ల పొడవులో రోడ్డు వెడల్పు పనులు చేపట్టారు. నాలుగేళ్లుగా చేపడుతున్నా పనులు పూర్తికావడంలేదు. ఇరు వైపులా డ్రైనేజీ కాలువలు, 800 మీటర్ల సీసీ రోడ్డు పనులు పూర్తి చేశారు. సీసీ రోడ్డుకు మధ్యలో డివైడర్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో సుమారు 400వరకు మొక్కలు నాటవచ్చని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయంలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని పేర్కొంటున్నారు. డివైడర్ మధ్యలో మొక్కలను నాటడం వల్ల దుమ్ము ధూళి నుంచి రక్షించుకోవచ్చన్నారు. అదే విధంగా రాత్రి వేళల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఉండవని పలువురు వాహనదారులు అంటున్నారు. ఉన్నాతాధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా, డివైడరు మధ్యలో మొక్కలు నాటాలని పలువురు కోరుతున్నారు.



మోమిన్‌పేటలోని ప్రధాన రోడ్డుపై నిర్మించిన డివైడర్

ఆరుతడి.. రైతన్న కంటతడి

- తగ్గుతున్న భూగర్భ జలాలు
- నీరు అందక ఎండుతున్న పంటలు
- ఆందోళనలో రైతన్నలు
- రెయిన్ డ్రిప్ సహాయంతో సాగు

పెద్దేముల్: బోర్లలో నీళ్లు తగ్గి, ఎండలు మండుతున్న వేళ ఆరుతడి పంటలకు నీరు అందక ఎండుముఖం పడుతున్నాయి. కళ్లముందే పంటలు ఎండిపోతుండటంతో రైతన్నలు కన్నీరుమున్నీరవుతున్నారు. నీటి లభ్యత లేకపోవడంతో కొందరు రైతులు కొత్తిమీర వంటి పంటలను రెయిన్ డ్రిప్ సహాయంతో సాగు చేస్తున్నారు. భూగర్భ జల మట్టం రోజురోజుకు పడిపోతున్నాయి. చెరువులు, కుంటల్లోనూ నీరు అడుగంటుతున్నాయి. నాలుగు ఎకరాలకు నీరు అందించే బోర్లు రెండు ఎకరాలకు కూడా నీరు అందించడంలేదని రైతులు చెబుతున్నారు. మండలంలోని పెద్దేముల్, జనగాం, బుద్దారం, మంబాపూర్, గాజీపూర్‌తో పాటు పలు గ్రామాల్లో రైతులు ఆరుతడి పంటలను సాగుచేశారు. అంతేకాకుండా రెయిన్ డ్రిప్ సహాయంతో ఉల్లి, కొత్తిమీర, మామిడి తోటలను సాగుచేస్తున్నారు. భూగర్భజలాలు పడిపోవటంతో నీరు అందక రైతులు ఆందోళనకు గురవుతున్నారు. జనగాం, గొట్లపల్లి, హన్మాపూర్, గిర్మాపూర్‌లో రైతులు రెయిన్ డ్రిప్ ద్వారా పంటలు సాగుచేస్తున్నారు. నెల రోజుల క్రితం నీటితో కళ కళలాడిన చెరువులు, కుంటలు నీరు తగ్గంటతో కళ తప్పాయి. పశువులకు సైతం నీరు దొరకని పరిస్థితి ఏర్పడిందని రైతులు అంటున్నారు.



పెద్దేముల్ మండలంలో రెయిన్ డ్రిప్‌తో కొత్తిమీర సాగు

సబ్సిడీపై స్ప్రింక్లర్లు అందజేయాలి

సన్న చిన్న కారు తేడాలేకుండా సాగు చేసే ప్రతి రైతుకు 100 శాతం సబ్సిడీపై స్ప్రింక్లర్లు అందజేయాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టాలన్నారు.

క్లుప్తంగా

ముదిరాజ్ హక్కుల కోసం పోరాటం

మెపా జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు



మండల కమిటీ అధ్యక్షులను సన్మానిస్తున్న జిల్లా నాయకులు

పరిగి: ముదిరాజ్‌ల అభ్యున్నతికి మెపా నిరంతరం కృషి చేస్తుందని ఆ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు తెలిపారు. ముదిరాజ్‌లను సంఘటితం చేస్తున్న పరిగి నియోజకవర్గ కమిటీని జిల్లా కమిటీ ఆదివారం పట్టణ కేంద్రంలో అభినందించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్ జర్నలిస్ట్, ఎంప్లాయిమెంట్ సంఘాలను సంఘటితం చేస్తూ మెపా సంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు. మెపా ద్వారా ముదిరాజ్‌లకు ఎక్కడ అన్యాయం జరిగిన వారి పక్షాన పోరాటం చేస్తామన్నారు. గ్రామ గ్రామాన ముదిరాజ్‌లను సంఘటితం చేసి హక్కులపై పోరాటం చేస్తామన్నారు. మండల కమిటీలను పూర్తి చేశామని, త్వరలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న రోజుల్లో మెపా ఒక శక్తిగా ఎదిగి ముదిరాజ్‌లను ఆర్థికంగా, రాజకీయ ఎదుగుదలకు కృషి చేస్తామన్నారు.

ఉత్సవాలకు ఎమ్మెల్యే విరాళం



ఎమ్మెల్యే తరఫున విరాళం అందజేస్తున్న బీఆర్ఎస్ నేతలు

దోమ: మండలంలోని ఐనాపూర్‌లో ఆదివారం రాత్రి, సోమవారం జరగనున్న మంద మైసమ్మ ఉత్సవాలకు పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి రూ. 20వేల విరాళం అందజేశారు. ఆదివారం ఈ మొత్తాన్ని స్థానిక నేతలతో ఉత్సవ నిర్వాహకుడు జీ అంతయ్యకు అందజేశారు. ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని స్థానిక నేతలు రుక్మయ్య గౌడ్, వెంకటేష్ సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తుందని వారు పేర్కొన్నారు.

మతిభ్రమించి మాట్లాడుతున్న ఈటల

పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి



ధారూరు: ఇతర పార్టీల నాయకులెవరు బీజేపీలో చేరకపోవడంతో ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు మతిభ్రమించిన ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి ఎద్దేవా చేశారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై ఈటల చేసిన ఆరోపణలను ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో తీవ్రంగా ఖండించారు. రేవంత్‌రెడ్డి నగరంలోని భాగ్య లక్ష్మి అమ్మవారి ఆలయానికి వస్తే ఈటల రాకుండా ముఖం చాటేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక బీజేపీ నేతలు నీతి మాలిన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మరోసారి ఇలాంటి నిరాధార ఆరోపణలు చేస్తే తగిన గుణపాఠం చెప్పాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

గుండె పోటుతో ఉప సర్పంచ్ మృతి



లాలప్ప(ఫైల్)

పెద్దేముల్: గుండె పోటుతో ఉప సర్పంచ్ మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఇందూరు గ్రామానికి చెందిన ఆర్ లాలప్ప(58) 4వ వార్డు నుంచి పోటీ చేసి గెలుపొందాడు. శనివారం సాయంత్రం గుండె పోటుకు గురై మృతి చెందాడు. ఆదివారం స్వ గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్

- ప్రజాకవి, గాయకుడు జయరాజ్
- కొత్లాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ
- పాల్గొన్న మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్



అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న జయరాజ్, ప్రసాద్‌కుమార్ తదితరులు

మర్పల్లి: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ప్రజాకవి, గాయకుడు జయరాజ్ అన్నారు. ఆదివారం మండలంలోని కొత్లాపూర్‌లో మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జయరాజ్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం నా జన్మ హక్కు అని పోరాటం చేసిన మహోన్నతమైన వ్యక్తి అంబేడ్కర్ అన్నారు. సైమన్ కమిషన్‌పై పోరాటం చేసి అణగారిన బీసీలకు మొదటి సారిగా రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అనంతరం మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ ప్రభాకర్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ విగ్రహ దాత మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మధుకర్, టీడీపీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సుభాష్‌యాదవ్, బీఎస్పీ వికారాబాద్ అసెంబ్లీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ క్రాంతి కుమార్, సర్పంచ్ ప్రభాకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామేశ్వర్, కాంగ్రెస్ పార్టీ బ్లాక్–2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎస్సీ ఎస్టీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నాను, బీఎస్పీ వికారా బాద్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ క్రాంతి కుమార్, మహిళ కన్వీనర్ నర్సమ్మ, మండల ఇన్‌చార్జ్ పర్వేద తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కళాకారులు అంబేడ్కర్‌పై పాడిన పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి.

రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాదరావు

దోమ: రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు, జిల్లా నాయకుడు శరత్ కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు చేవెళ్ల బహిరంగ సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో నియంత పాలన సాగుతోందని, ఆ పాలనకు చరమగీతం పాడాలన్నారు. సీఎం కేసీఆర్ ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తెలంగాణ వనరులను దోచుకుంటూ కుటుంబ సభ్యులకు ఆస్తులను కూడబెడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు చరమగీతం పాడాలని ఆయన పిలుపునిచ్చారు.



మోత్కూరులో ర్యాలీగా వెళ్తున్న బీజేపీ నేతలు

ఈటల దిష్టిబొమ్మ దహనం



ధారూరులో ఈటల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

దౌల్తాబాద్: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మునుగోడు ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో కుమ్మక్కై రూ. 25కోట్లు తీసుకున్నారని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆరోపణలు చేయడంపై ఆదివారం దౌల్తాబాద్‌లో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈటల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. నికార్సయిన నాయకుడు రేవంత్‌రెడ్డి అని, డబ్బులకు అమ్ముడుపోయే వ్యక్తి కాదని స్పష్టం చేశారు. అసత్య ఆరోపణలు చేసిన ఈటల బహిరంగ క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వీరన్న, దస్తప్ప, సాయిలు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



దౌల్తాబాద్‌లో ఈటల దిష్టిబొమ్మతో నిరసన తెలుపుతున్న యువజన కాంగ్రెస్ నాయకులు

ధారూరులో..

ధారూరు: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ వ్యాఖ్యలకు నిరసనగా ఆయన దిష్టిబొమ్మను ఆదివారం యూత్ కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. ఈటలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ధారూరు ఉప సర్పంచ్ ఎల్ రాజేశ్వర్, నాయకులు లింగనపల్లి అశోక్ ముదిరాజ్, బుజ్జయ్యగౌడ్, ఎన్ అశోక్, టీ మల్లేశం, కార్తీక్‌రెడ్డి, ప్రశాంత్, బాలు, మాణిక్యం, శివకుమార్, బీ అంజయ్య, రవీందర్, అవినాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు

పరిగి: విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఆపరేటర్లుగా, ఓ ఎం విభాగంలో పనిచేస్తున్న హెచ్ 82 ఆర్టిజన్స్ యూనియన్ ఈ నెల 25న సమ్మె చేయనున్నట్లు నోటీసు ఇవ్వడం జరిగిందని ఏడీఈ రమమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే తమ శాఖ సిబ్బంది, పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. యూనియన్ సభ్యులు విద్యుత్ సమస్యలు సృష్టించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అలాంటి సంఘటనలు జరిగితే ఫొటోలు, వీడియోలు తీసి తమకు పంపాలని కోరారు.

డివైడర్ ఎక్కించి.. బైక్‌ను ఢీకొట్టి..

- డీసీఎం బీభత్సం, మద్యం మత్తులో డ్రైవర్
- కాబోయే దంపతులకు తీవ్ర గాయాలు

పహాడీషరీఫ్: తాగిన మైకంలో డీసీఎం డ్రైవర్ రోడ్డు మధ్యలోని డివైడర్‌ను ఎక్కించి అవతలి వైపు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న కాబోయే దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఎస్ఐ సీ వెంకటయ్య కథనం మేరకు.. ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామానికి చెందిన జానకీరాం కుమార్తె వీ ప్రియదర్శిని ఇబ్రహీంపట్నంలోని శ్రీదత్త ఇన్‌స్టిట్యూట్‌లో ఎం-ఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈమెకు కడ్తాల్ మండలం డాసర్ల పల్లి ప్రాంతానికి చెందిన నేనావత్ జైపాల్‌తో వివాహం కుదిరింది. ఆదివారం మధ్యాహ్నం వీరు బైక్‌పై కడ్తాల్‌కు బయలుదేరారు. మధ్యాహ్నం 1.20 గంటలకు తుక్కుగూడ హైవేలోని టీఎస్ఐఐసీ కార్యాలయం వద్దకు రాగానే.. తుక్కుగూడ నుంచి వస్తున్న డీసీఎం వ్యాన్ రోడ్డు మధ్యలోని డివైడర్‌ను ఎక్కించి ఇవతలి రోడ్డులో వస్తున్న బైక్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో ప్రియదర్శిని, జైపాల్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను ఎల్‌బీనగర్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించారు. ప్రియదర్శిని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా డీసీఎం డ్రైవర్ తాగి వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు.

ట్రస్ట్ పేరుతో టోపీ!

సాక్షి, సిటీబ్యూరో: వివిధ దీర్ఘకాలిక రుగ్మతలతో బాధపడుతున్న చిన్నారులను ఆదుకునే పేరుతో నకిలీ ట్రస్ట్ ఏర్పాటు చేసిన ఓ ద్వయం అందినకాడికి దండుకుంటోంది. కర్ణాటకలోని బెంగళూరుతో పాటు హైదరాబాద్‌లోనూ బ్రాంచ్‌లు ఏర్పాటు చేసి, కాల్ సెంటర్ నుంచి టెలీకాలర్ల ద్వారా దందా చేస్తోంది. దీనిపై ఫిర్యాదు అందుకున్న బెంగళూరు సీసీబీ పోలీసులు శనివారం ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వీరి చేతిలో మోసపోయిన వారిలో తెలంగాణకు చెందిన వాళ్లూ పెద్ద సంఖ్యలో ఉన్నారని అధికారులు చెబుతున్నారు. కర్ణాటకలోని వివిధ ప్రాంతాలకు చెందిన అజయ్ ఎన్వీ, వెంకటాచలపతి సంయుక్తంగా చైల్డ్ లైఫ్ ఫౌండేషన్ పేరుతో చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేశారు. దీనికి అనుబంధంగా బెంగళూరులో కేఆర్ అండ్ లవ్, ఆశా కుటీర్ ఫౌండేషన్, హైదరాబాద్‌లో వీ4 పేరుతో సంస్థలు నెలకొల్పారు. ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోకుండా, సంబంధిత శాఖల వద్ద రిజిస్ట్రేషన్ చేయించకుండా తమ పని ప్రారంభించారు. ఆయా పత్రాలన్నింటినీ నకిలీవి సృష్టించారు. వీటితో పాటు తాము ఆదుకున్న చిన్నారులు అంటూ నకిలీ ఫొటోలు, తమకు ఇప్పటి వరకు డొనేషన్లు ఇచ్చిన వారి వివరాలని చెప్తూ నకిలీ రసీదులు సృష్టించారు. వీటన్నింటినీ తమ సంస్థ పేరుతో రూపొందించిన వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. బెంగళూరులోని బొమ్మనహెళ్లిలో ఉన్న అక్యుమెన్‌ట్రిక్స్ భవనంలో ప్రత్యేకంగా కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు. కొందరు టెలీకాలర్లను నియమించుకున్న ఈ ద్వయం వివిధ మార్గాల్లో తెలంగాణ, కర్ణాటకలకు చెందిన అనేక మంది ఫోన్ నెంబర్లు సంగ్రహించారు. వీరికి ఫోన్లు చేయిస్తున్న అజయ్, వెంకటాచలపతి తాము చిన్నారులను ఆదుకుంటున్నామని నమ్మబలుకుతూ తమ వెబ్‌సైట్ చూసేలా చేస్తున్నారు. ఇలా వీరి వల్లోపడుతున్న అనేక మంది నుంచి డొనేషన్ల పేరుతో అందినకాడికి తమ ఖాతాల్లో బదిలీ చేయించుకుంటున్నారు. దీనిపై బెంగళూరు డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ అధికారి శృతి యూ బాయ్ అక్కడి సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ (సీసీబీ) అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న అధికారులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేసి భారీ స్థాయిలో మోసం జరిగినట్లు నిర్ధారించారు. దీంతో శనివారం కాల్ సెంటర్‌పై దాడి చేసిన అధికారులు అజయ్, వెంకటాచలపతిలను అరెస్టు చేశారు.

కమలోత్సాహం



బీజేపీ విజయ సంకల్ప సభకు భారీగా తరలివచ్చిన జనం

- సభ విజయవంతంతో బీజేపీ శ్రేణుల్లో జోష్
- భారీగా తరలివచ్చిన జనం
- ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

చేవెళ్ల/మొయినాబాద్/శంకర్‌పల్లి: విజయ సంకల్ప సభ జయప్రదం కావడంతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నిండింది. భారీగా జనాన్ని తరలించడం ద్వారా పార్టీ సత్తాచాటారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున రావడంతో జనసమీకరణపైనా దృష్టి సారించటంతో సభ సక్సెస్ అయింది. పట్టణంలోని రోడ్లన్నీ బీజేపీ జెండాలతో నిండిపోయాయి. నాయకులు ఏర్పాటు చేసిన భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎండ ప్రభావంతో సాయంత్రం 6గంటల తర్వాతే జనం సభా ప్రాంగణంలోకి చేరుకున్నారు. అంతకు ముందు సందడి కనిపించకపోవడంతో మీటింగ్ విజయవంతంపై అనుమానాలు రేకెత్తాయి. కేవలం గంట వ్యవధిలోనే తరలివచ్చిన కార్యకర్తలతో సభా ప్రాణంగా పూర్తిగా నిండిపోయింది. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వేదికపైకి వచ్చేసరికి జన పెద్దసంఖ్యలో చేరుకున్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఇప్పటి వరకు నిర్వహించిన బీజేపీ సభల్లో ఇంత పెద్ద ఎత్తున విజయవంతమైన మీటింగ్ ఇదే కావడం గమనార్హం. సభ జయప్రదం కావడంతో ఇతర పార్టీల నాయకులు ఆలోచనలో పడే పరిస్థితి నెలకొంది.



కళాకారుల ధూంధాం

అన్ని ఏర్పాట్లు

సభకు వచ్చిన జనం ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. వేసవి కాలం కావడంతో అన్ని గ్యాలరీల ముందు వాటర్ బాటిళ్లు ఏర్పాటు చేశారు. అయితే ఈ సభలో మహిళలు ఆశించిన స్థాయిలో కనిపించలేదు. పార్టీ వలంటీర్లు ఎక్కడిక్కడే ప్రజలను సభలో కూర్చునే విధంగా అందుబాటులోఉండి సేవలు అందించారు.

అధికారమే ధ్యేయమవ్వాలి..

అమిత్‌షా సభ వేదికపైకి ముఖ్య నేతలకు మినహా.. స్థానిక నాయకులకును అనుమతించలేదు. దీంతో వేదిక వెనకభాగంలో నిలబడి అంతా సభావేదిక వెనకబాగంలో నిలబడి అమిత్‌షాను కలిశారు. అధికారంలోకి రావడమే ధ్యేయంగా పనిచేయాలని అమిత్‌షా వారికి సూచించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

సినీనటుడు కిరణ్‌కుమార్

- విజేత జట్లకు బహుమతుల ప్రదానం

హుడాకాంప్లెక్స్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సినీనటుడు, తెలంగాణ మా అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ సూచించారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదరణ, సునీత ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదరణ అమితాభ విద్యాలయ పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన క్రికెట్, కబడ్డీ పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. క్రీడల్లో రాణిస్తే సమాజంలో గుర్తింపుతో పాటు దేశానికి, రాష్ట్రానికి ప్రాతినిథ్యం వహించే అరుదైన గౌరవం దక్కుతుందన్నారు. విద్యార్థులు మానసిక, శారీరకంగా, ఆరోగ్యంగా ఎదిగేందుకు క్రీడలు ఉపయోగపడతాయని చెప్పారు. క్రీడలను జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని సూచించారు. ఆదరణ, సునీత ఫౌండేషన్లు ముందుకు వచ్చి ఈ పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. విజేత జట్లకు నగదు బహుమతితో పాటు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆదరణ ఫౌండేషన్ చైర్మన్ జేడీ మాధవరావు, సునీత ఫౌండేషన్ చైర్మన్ సునీతారెడ్డి, ఉపాధ్యక్షురాలు వెంకటేశ్వర్‌రావు, అమితభా ఫౌండర్ అధ్యక్షురాలు పూజ, ప్రధాన కార్యదర్శి ఎం నాగరాజు, ఆనంద్, ప్రహ్లాద్, వెంకట సురేష్ తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్లతో కిరణ్‌కుమార్, నిర్వాహకులు

కుక్కల దాడిలో 40గొర్రెల మృతి

శంకర్‌పల్లి: కుక్కలు గొర్రెల మందపై దాడి చేయడంతో 40 జీవాలు మృతి చెందిన సంఘటన శంకర్‌పల్లి మండలంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పర్వేద గ్రామానికి చెందిన జీ అనంతయ్య గొర్రెలు మేపుతూ జీవనం సాగిస్తున్నారు. శనివారం గొర్రెలను మేపుకొని గ్రామ శివారులో ఏర్పాటు చేసిన మందలో ఉంచి ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం వెళ్లి చూడగా మందలో కుక్కలు కనిపించడంతో అనంతయ్య ఆందోళన చెందాడు. పెద్ద సంఖ్యలో గొర్రెలు మృత్యువాత పడడంతో బాధితులు బోరున విలపించారు. 30 గొర్రెలు, 10 గొర్రె పిల్లలు మృతి చెందాయని, వాటి విలువ సుమారు రూ. 3లక్షల, 50వేల వరకు ఉంటుందని తెలిపారు. బాధితుడు అనంతయ్యను సర్పంచ్ అనిత పరామర్శించారు. ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం అందేలా చూస్తామని ఆమె హామీ ఇచ్చారు.



కుక్కల దాడిలో చనిపోయిన గొర్రెలు

డంపింగ్ యార్డును అడ్డుకుంటాం

పస్మాముల గ్రామస్తుల తీర్మానం

హయత్‌నగర్: గ్రామంలోని రామాలయం వద్ద మున్సిపల్ శాఖ ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డును కలిసికట్టుగా అడ్డుకోవాలని ప్స్మాముల గ్రామస్తులు తీర్మానించారు. డంపింగ్ యార్డు, మురుగు నీటి సమస్యలపై ఆదివారం గ్రామంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. మున్సిపాలిటీకి చెందిన డంపింగ్ యార్డును పక్క గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారనే కారణంగా దాన్ని రామాలయం సమీపంలోకి తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, భూ సర్వే కోసం కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న డంపింగ్ యార్డు మా గ్రామ రెవెన్యూ పరిధిలోనే ఉందని, గతంలో రూ. 80లక్షల వ్యయంతో అక్కడ ఏర్పాటు చేశారని, దాన్ని తరలించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మురుగు నీరు గ్రామంలోని చెరువులోకి చేరుతుండడంతో ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, దీనికి తోడు చెత్త డంపింగ్ చేస్తే గ్రామంలో ఉండలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డును ఉన్న చోటి నుంచి తరలించకుండా పార్టీలకు అతీతంగా అందరూ ఏకమై పోరాడాలని తీర్మానించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సీ స్వప్న, మాజీ సర్పంచులు కే జైపాల్‌రెడ్డి, సీ శంకరయ్యగౌడ్, మాజీ కౌన్సిలర్ జీ భాస్కర్‌గౌడ్, యువజన, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న స్థానికులు

బైక్ దొంగ అరెస్టు

రూ.6 లక్షల విలువైన వాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలను చూపిస్తున్న ఏసీపీ శ్యామ్‌సుందర్ తదితరులు

మలక్‌పేట: విలాసాలు, చెడు వ్యసనాలకు బానిసైన ఓ వ్యక్తి బైకుల చోరీకి పాల్పడుతున్నాడు. ఈమేరకు పోలీసులు అతన్ని అరెస్టు చేసి రూ.6 లక్షలు విలువైన బైకులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ శ్యామ్‌సుందర్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీఐ భాస్కర్‌రెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. చౌటుప్పల్ మండలం తంగడపల్లి బీరప్ప కాలనీ చెందిన ఓర్సు యాదయ్య స్టోన్‌క్రషర్ కంపెనీలో కూలీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో డబ్బుల ఆశకు పోయి బైకుల దొంగతనాలు ప్రారంభించాడు. రాత్రి సమయాల్లో ఒంటరిగా ఉన్న ప్రాంతాలను రెక్కీ చేసి, స్నేహితుడైన మైనర్ బాలునితో కలిసి బైక్‌లు దొంగతనం చేయడం షురూ చేశాడు. పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాల హ్యాండిల్ లాక్ బ్రేక్ చేసి, వైర్ కనెక్ట్ ద్వారా వాహనాలు దొంగతనం చేస్తున్నారు. ఆ తర్వాత ఆ వాహనాల నెంబర్ ప్లేట్స్‌ను తొలగిస్తున్నారు. క్రైమ్ సిబ్బంది గడ్డిఅన్నారం ఎక్స్‌రోడ్‌లో వాహనాలు తనిఖీలు చేస్తుండగా యాదయ్య, మైనర్ బాలుడు పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నిజాన్ని అంగీకరించారు. మలక్‌పేట పీఎస్‌లో 2, వనస్థలిపురం పీఎస్ పరిధిలో 2, బజాజ్ బాక్సర్ వాహనం మొత్తం ఐదు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. యాదయ్యను రిమాండ్‌కు, బాలుడుని జువైనల్ హోమ్‌కు తరలించామన్నారు. డీఎస్సై సాయితేజారెడ్డి, క్రైమ్ సిబ్బందిని అభినందించి రివార్డులు అందజేశారు.